ప్రజాశక్తి

గురువారం 16 జనవరి 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పైర్లకు నీటి ఎద్దడి!

పల్నాడు జిల్లాలో పెరుగుతున్న సమస్య - రబీ సాగులో పొంచి ఉన్న ఇబ్బందులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పొలాల్లోని పైర్లకు నీటి ఎద్దడి పొంచి ఉంది. గత మూడు నెలల్లో పలుమార్లు తుపాన్లు వచ్చినా పల్నాడు జిల్లాలో ఒక మోస్తరుగానే వర్షాలు కురిశాయి. గత నెల రోజులుగా పల్నాడులో వర్షాలు అంతగా లేవు. దీంతో పంటలకు మళ్లీ నీటి అవసరం పెరుగుతోంది. మరోవైపు ఎగువ నుంచి ప్రవాహం కూడా లేకపోవడం వల్ల నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గుతున్నాయి. సెప్టెంబరు మొదటి వారంలో సాగర్, పులిచింతల పూర్తిస్థాయిలో నిండి ప్రకాశం బ్యారేజి నుంచి భారీగా వరదనీరు సముద్రంలోకి చేరింది. వరద ప్రభావం దాదాపు నవంబరు రెండో వారం వరకు కొనసాగింది. పులిచింతల జలాశయంలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా బుధవారం సాయంత్రం 41.39 టిఎంసిల నీటి నిల్వ ఉంది. నాగార్జున సాగర్‌లో గరిష్టనీటి నిల్వ 312 టిఎంసీలు కాగా ప్రస్తుతం 239.42 టిఎంసిలు మాత్రమేనీటి నిల్వ ఉంది. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో 1.70 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. మిర్చికి ఇంకా కనీసం రెండు తడులు అవసరం ఉంది.

రబీలో గుంటూరు జిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో రబీ పంటలు వేశారు. పల్నాడు జిల్లాలో లక్ష ఎకరాలల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. గుంటూరు జిల్లాలో గత ఆగస్టు 31 నుంచి గతనెల 15 వరకు వరుసగా వచ్చిన తుపాన్లు ప్రభావంతో అధిక వర్షాలు

▶ 2లో

రైతు సమస్యలపై విజయవాడలో రేపు ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు విడుదల చేయాలని, ఇతర రైతుల సమస్యలపై విజయవాడలో శుక్రవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. ఇప్పటికే ఖరీఫ్ ముగిసి, రబీ సీజన్ కూడా సగం కాలం గడిచిపోయినా పెట్టుబడి సాయం ఇంత వరకూ ఇవ్వలేదన్నారు. కరువుకు గురైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని, ఉచిత పంటల బీమా రద్దు చేసి, రైతులే చెల్లించాలని జిఒ ఇచ్చిందని విమర్శించారు. పంట కాల్వల్లో పూడిక తీత, తూటికాడ, గుర్రపుడెక్క తొలగించాలని, వాణిజ్య, ఉద్యాన, మిగిలిన అన్ని పంటలకూ ధరలు పడిపోకుండా చర్యలు తీసుకోవాలని, గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులు విడుదల చేయాలని, పెదవడ్లపూడి హైలెవల్ చానల్ ఎత్తిపోతల పథకం వెంటనే పూర్తి చేయాలని, పాడి రైతులకు పొరుగు రాష్ట్రాల్లో ఇస్తున్న విధంగా లీటర్ రూ.5 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలతోపాటు రైతులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ధర్నాకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు ఐ.రామారావు, ఐ.నాగేశ్వరరావు, బి.ముత్యాలరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విజయవాడలో ధర్నా విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

▶ 2లో



మంగళగిరి మండలం ఆత్మకూరులోని నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు నగర్‌లో ముగ్గుల పోటీలు

సంక్రాంతి సంబరాలతో మురిసిన గ్రామసీమలు



యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో మహిళలకు టగ్ ఆఫ్ వార్ పోటీ

తండ్రి అంత్యక్రియలు పూర్తి..
కుమారుడు, బంధువు మృతి

ప్రజాశక్తి - అచ్చంపేట : తండ్రి అంత్యక్రియల అనంతరం కుమారుడు, మరో బంధువు మృత్యువాత పడ్డాడు. పల్నాడు జిల్లాలోని మండల కేంద్రమైన అచ్చంపేట పరిధిలోని చామర్రు బీసీ కాలనీలో బుధవారం జరిగిన ఘటనపై మృతుల బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన గౌతుకట్ల కోటయ్య (70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కృష్ణా జిల్లా చందర్లపాడు మండలం రామన్నపేటకు చెందిన తెల్లమేకల నాగేశ్వరావు (40) వచ్చాడు. మంగళవారం రాత్రి కోటయ్య కుమారుడు గౌతకట్ల నాగేశ్వరరావు (48), అతనికి బావమరిది అయిన తెల్లమేకల నాగేశ్వరరావు కలిసి మద్యం తాగారు. ఇద్దరికీ వాంతులు, విరోచనాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేకు అచ్చంపేట సిఐ వెంకటప్రసాద్ కేసు నమోదు చేశారు. తెల్లమేకల నాగేశ్వరరావు మృతదేహాన్ని రామన్నపేటకు తరలించగా గౌతుకట్ల నాగేశ్వరరావు మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



కొమ్ముబూరల నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ధరల పోటు.. నష్టాల ఘాటు

రేటు పడిపోవటంతో రైతులు దిగాలు

గతేడాది కంటే క్వింటాళ్‌కు రూ.3 వేల వరకు తగ్గుదల

అమ్ముకోవాలన్నా రవాణా భారం

- 3 లో

పల్లెల్లో నగరవాసుల మూలాలు

జిఎంసి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల ముగింపులో ఎంపీ కృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడాప్రాంగణంలో నాలుగు రోజులపాటు జరిగిన సంక్రాంతి సంబరాలు బుధవారం ముగిశాయి. సంక్రాంతి సందర్భంగా మంగళవారం గంగిరెద్దుల విన్యాసాలు, ఎద్దుల ప్రదర్శనలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, కర్రసాము, కోలాటం, స్టార్ మ్యూజికల్‌నైట్, కాంతారా యాక్ట్, జగలర్స్ షో, బటర్ ఫ్లై, రోబో యాక్ట్ ప్రదర్శనలు అలరించాయి. ముగింపు రోజైన బుధవారం గాలిపటాలు ఎగురవేసి, ప్రాసమణి ప్రోగ్రామ్, మ్యాజిక్ షో(ఇల్ యూజన్ షో), క్లాసికల్, ఫోక్ డ్యాన్స్ (ఖలీల్), వాసవి ఆర్కెస్ట్రా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముగింపు వేడుకలకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరై నగరాల్లో నివసించే ప్రతి ఒక్కరి మూలాలు గ్రామాలతో ముడిపడి ఉంటాయన్నారు. రైతులు సంతోషంగా ఉంటేనే సమాజం సంతోషంగా ఉంటుందని, ఈ ఏడాది వర్షాలు కురిసి పంటలు బాగా పండాయని, పంటలకు తగిన

▶ 2లో



రెడ్డిపాలెం గ్రామ సమీపంలో సాగవుతున్న మినుము

మెలవకులతో అపరాలలో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అపరాలు సాగు చేసే రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ నరసరావుపేట డివిజన్ ఏడిఏ పి.మస్తానమ్మ సూచించారు. పెసర, మినుము పంటలు ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్నాయని చెప్పారు. వరి తర్వాత ప్రధాన పంటగా రైతులు అపరాలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం మంచు విపరీతంగా కురుస్తుండడంతో పేనుబంక, కాయతొలుచు పురుగు వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని చెప్పారు. పంట పిందె దశలో ఉన్నప్పుడు ఎకరాలకు కిలో మల్టీ-కె తో పాటు 400 గ్రాముల డైమోథియేట్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.



జ్యోతిని వెలిగిస్తున్న కాంతారావు దంపతులు

ఘనంగా మరకజ్యోతి దర్శన మహోత్సవం


ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంపత్‌నగర్, అయ్యప్పస్వామి దేవస్థానంలో మకరోజ్యోతి దర్శన కార్యక్రమం క్రేన్ అనుబంధ క్రేన్ రిలీజియన్ ట్రస్ట్, క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి వెంకటసత్యలక్ష్మి కాంతారావు, లక్ష్మీ హైమావతి పంపతలు మంగళవారం నిర్వహించారు. తొలుత స్వామి వారి తిరువాభరణాలను సంపత్‌నగర్‌లోని క్రేన్ వక్కపొడి ఫ్యాక్టరీ నుండి దేవాలయానికి కాంతారావు దంపతులు, కాంతారావు పెద్ద అల్లుడు, కుమార్తె మానేపల్లి దివాకర్, హిమజ, ఇతర కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అనంతరం కాంతారావు దంపతులు మరజ్యోతి వెలిగించారు. జివిఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ 49 ఏళ్లుగా సంపత్‌నగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లా నలుమూలల నుండి భక్తులు, స్వాములు వస్తుంటారని తెలిపారు. కార్యక్రమంలో క్రేన్ గ్రూప్ సంస్థల సిబ్బంది, టంగుటూరి మణి, ప్రముఖులు పాల్గొన్నారు.

అవగాహన ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని కార్యాలయంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు కళాకారులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బుధవారం మూడోరోజు కార్యక్రమాన్ని మిమిక్రీ, మెజీషియన్ కళాకారుడు ఆర్‌పి.ఎల్.నరసింహారావు ప్రారంభించి మాట్లాడుతూ హాస్యం ఒక ఆప్తమిత్రుడి వంటిదని, నవ్వుతూ జీవిస్తే ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. లాఫింగ్ థెరపిస్ట్ డాక్టర్ వి.విరామ్‌కుమార్, భాగ్యలక్ష్మి, రమణ, వివి.రావ్, గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్‌కు సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆర్.వి.సింగరయ్యకు ప్రథమ బహుమతి, పి.భావన్నారాయణకు ద్వితీయ బహుమతి, జి.వెంకటేశర్లుకు తృతీయ బహుమతి అందచేశారు. కార్యక్రమంలో సిరసపల్లి కృష్ణారావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త ఇ.చంద్రయ్య, ఆర్.వెంకటరత్నం పాల్గొన్నారు.



రైతు నాయకుని దీక్షకు సంఘీభావం

దేశానికి కాపలా అంటూ అదానీ, అంబానీ ఆస్తులకు కాపలా కాస్తున్న ప్రధాని మోడీ : ముప్పాళ్ల నాగేశ్వరరావు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని 50 రోజులుగా ఢిల్లీ నగరంలో నిరాహారదీక్ష చేస్తున్న జగ్జీత్ సింగ్ దలేవాల్ ప్రాణాలకు ముప్పు వాటిల్లితే కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. దీక్షకు మద్దతుగా నరసరావుపేటలోని గాంధీపార్క్ వద్ద గల ధర్నా చౌక్‌లో సిపిఐ, ప్రజా, రైతు సంఘాలు సంఘీభావ దీక్ష చేశాయి. కార్యక్రమానికి ఏపి రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి యు.రాము అధ్యక్షత వహించగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలను ప్రధాని విస్మరించారని, దీనిపై ప్రశ్నించడానికి వచ్చిన రైతుల్ని పోలీసులు, లాఠీలతో అణచాలని చూస్తున్నారని అన్నారు. రైతులు కన్నెర్ర చేస్తే మోడీ లాంటి నియంతలు కాలగర్భంలో కలిసిపోతారని అన్నారు. ఎముకలు కొరికే చలిలో కూడా 750 మంది పైగా రైతుల ప్రాణాలు పోయినా 13 నెలలపాటు రైతులు పోరాడి ప్రధానితో క్షమాపణలు చెప్పించారని గుర్తు చేశారు. దేశానికి కాపలాదారునని చెప్పుకుంటున్న మోడీ నిజానికి అదాని, అంబానీ ఆస్తులకు కాపలకాస్తున్నారని ఎద్దేవ చేశారు. రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కెవివి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను, సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్న పాలకులు వ్యవసారంగాన్ని కూడా కట్టబెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ కుటిల యత్నాలను రైతులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, ప్రముఖ న్యాయవాది సిజే ప్రతాప్, వివిధ సంఘాల నాయకులు షేక్ హుస్సేన్, కె.రాంబాబు, షేక్ గని, హనిమిరెడ్డి, ఎస్.కె.జిలానీ మాలిక్, బి.శ్రీనివాసరావు, టి.బాబురావు, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

సంక్రాంతి ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు



ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని ప్రతి గ్రామంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా చేసుకున్నారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రమైన ముప్పాళ్లలో అన్నదాసు అచ్చయ్య, అన్నదాసు వెంకటస్వామి, అన్నదాసు వెంకటేశ్వర్లు, పోలిశెట్టి శివప్రసాద్ ఇంటి వద్ద ప్రతి ఏటా ఏర్పాటు చేసే సంక్రాంతి సంబరాలు వేడుకల్లో భాగంగా రంగవల్లులు, ఇతర పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. నారాయణం కిషోర్‌బాబు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల కలబోత సంక్రాంతి అని, కుల, మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ పండగ చేసుకుంటాని అన్నారు. చిన్నారులకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించడం ద్వారా వారిలోని ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. కార్యక్రమంలో అన్నదాసు సురేష్, నాము శివ, పోలిశెట్టి రామారావు, పోటు సాంబయ్య, సుంకర ఆంజనేయులు, వెంకటరమణ, ముప్పాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

పల్లెల్లో నగరవాసుల మూలాలు

(మొదటి పేజీ తరువాయి)



ధరలు దక్కి రైతుల ఇంట కాంతి ఈ సంక్రాంతి ఇవ్వాలని ఆకాంక్షించారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గుంటూరు నగరంలో సంప్రదాయ సంక్రాంతి సంబరాల ద్వారా నగర వాసులను అలరించడానికి జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు కృషి అభినందనీయమన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే ప్రతి ఇంట ఆనంద క్రాంతి వెల్లివిరియడమని, ఇటువంటి సంబరాలు ప్రతి ఏడాది జరగాలని కోరారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ జిఎంసి ఆధ్వర్యంలో ఈ సంబరాల్లో ప్రతి రోజు వయస్సుతో సంబంధం లేకుండా వేల మంది హాజరై ఆనందించారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, జిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ అమత, కార్పొరేటర్లు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎన్ఇసి ఎన్‌సిసి క్యాడెట్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గణతంత్ర దినోత్సవ సందర్భంగా అమరావతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి గణతంత్ర వేడుకల పరేడ్‌కు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్లు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న కె.హరీష్, సిపిఎల్ కె.కావేరి, ఎ.ఆర్తి, రిజర్వు కేటగిరిలో డి.అప్పల నాయుడు ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 26వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేడుకలలో వీరు పాల్గొంటారని తెలిపారు. కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనపరచి కళాశాలకు మంచి పేరు తీసుకునిరావాలన్నారు. కళాశాలకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా రాష్ట్ర స్థాయి వేడుకలలో పాలుపంచుకోవటం గర్వకారణంగా ఉందన్నారు. ఎంపికైన క్యాడెట్లను 23వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, కళాశాల ఎన్సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు, విభాగధిపతులు అభినందించారు.

పైర్లకు నీటి ఎద్దడి!

(మొదటి పేజీ తరువాయి)

కురిశాయి. దీంతో గుంటూరు జిల్లాలో ప్రస్తుతానికి నీటి అవసరాలు తక్కువగానే ఉన్నాయి. కానీ పల్నాడు జిల్లాలో మిర్చి, శనగ, మొక్క.జొన్న, జొన్న, వరి, కందితో పాటు వివిధ రకాల పంటలకు నీటి అవసరం పెరుగుతోంది. పల్నాడు జిల్లాలో 20 వేల ఎకరాల్లో వరి, మరో 21 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 4 వేల ఎకరాల్లో కంది, పొగాకు 12 వేలు ఎకరాలు, మినుము 5 వేల ఎకరాలు, ఇతర పంటలు 22 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసిన మిర్చికి, రబీలో సాగు చేసిన మొక్కజొన్నకు నీటి అవసరం ఉన్నట్టు రైతులు తెలిపారు. గుంటూరు జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో రబీ పంటలు సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకే కేవలం 1.10 లక్షల ఎకరాల్లోనే రబీ పంటలు వేశారు. జిల్లాలో వరి 1700 ఎకరాల్లో వేశారు. జొన్న 20 వేల ఎకరాలు, మొక్కజొన్న 38 వేల ఎకరాలు, శనగ 16 వేల ఎకరాలు, పెసర 13 వేల ఎకరాలు, మినుము 14 వేల ఎకరాలు సాగు చేశారు. పొగాకు 9 వేల ఎకరాల్లో వేశారు. రబీ ముగింపు దశకు చేరుకుంది. ఈ ఏడాది డెల్టాలో నీటి ఎద్దడి లేకున్నా రబీ సాగు పెరగలేదు. సాధారణ విస్తీర్ణం కంటే ఇంకా 30 శాతం తక్కువానే ఉందని అధికారులు తెలిపారు.

రైతు సమస్యలపై విజయవాడలో రేపు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

ఎం.శివసాంబిరెడ్డి కోరారు. చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలితో కలిసి బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పంటలకు మద్దతు ధరల చట్టం కోసం జరుగుతున్న ఆందోళనలను కేంద్రం ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేస్తోందని విమర్శించారు. రైతు నాయకులు వాలేసింగ్ 47 రోజులుగాచేస్తున్న నిరాహార దీక్షను పట్టించుకోకపోవడం, రైతు సంఘాలతో చర్చించకపోవడం శోచనీయమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలకొట్టమని చెప్పిన చంద్రబాబు, లోకేష్ ఇప్పుడు అదాని స్మార్ట్ మీటర్లను బిగించే ప్రయత్నాన్ని ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. జంపని, చినరావూరు మధ్య రైల్వే గేటును పునరుద్ధరించాలని, పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ ఎత్తిపోతల పథకం పథకానికి నిధులను మంజూరు చేయాలని, 26 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

మృతులకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మాచర్ల మండలం కొత్తపల్లికి చెందిన గంటా పెద్దిరాజు (55) గుండెపోటుతో మృతి చెందగా భౌతికకాయాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం సందర్శించి నివాళు లర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఇదే గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన గుండెబోయిన సుబ్బమ్మ (85) భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు నేరేటి వీరాస్వామి యాదవ్, గుండెబోయిన శ్రీను, గంటా శ్రీను, లింగయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పండగ వేళ విషాదం

గుండెపోటుతో డిఎస్‌పి, వైద్యుడు మృతి

మానసిక సమస్యలతో మాజీ విలేకరి ఆత్మహత్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



డిఎస్‌పి ఎం రత్తయ్య

సంక్రాంతి పర్వదినం రోజుల్లో పలు విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. డిజిపి కార్యాలయంలో పనిచేస్తున్న డిఎస్‌పి ఎం.రత్తయ్య (54) సోమవారం రాత్రి స్థానిక రమేష్ ఆస్పత్రిలో గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం పండగ రోజు పోలీసు వర్గాలను కలిచివేసింది. ఎస్‌ఐ స్థాయి నుంచి డిఎస్‌పి వరకు పోలీసు శాఖలో పనిచేసిన ఆయన స్వస్థలం యద్దనపూడి మండలం సురవరపల్లి గ్రామంలో బుధవారం పోలీసు లాంచనాలతో అంత్యక్రియలు జరిగాయి. 1995లో ఆయన పోలీసు శాఖలో ఎస్‌ఐగా చేరారు. పదోన్నతిపై కొన్ని ఏళ్ల డిఎస్‌పిగా పనిచేస్తున్నారు. గతంలో పలు దినపత్రికల్లో విలేకరిగా పనిచేసిన కోలుకొండ శ్రీకర్ (55) బుధవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఒక అపార్టుమెంట్ ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గత ఆరు నెలలుగా ఆయనకు ఆరోగ్యం బాగోనందున ప్రముఖ దిన పత్రికలో ఉద్యోగం మానివేసినట్టు, మానసిక సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతూ శ్రీకర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ఆయన తండ్రి ఏడాదిన్నర క్రితం మృతి చెందినప్పటి నుంచి శ్రీకర్ మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్టు సన్నిహితులు తెలిపారు. శ్రీకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



కోలుకొండ శ్రీకర్

ప్రజాశక్తి-గుంటూరు



డాక్టర్ షేక్ ముస్తఫా

గుంటూరు నగరంలోని ప్రముఖ ఛాతి, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ షేక్.ముస్తఫా (60) గుండె పోటుతో మంగళవారం మతి చెందారు. ఆయన గుంటూరు నగరంలో షిఫా హాస్పిటల్ ను నిర్వహిస్తున్నారు. ఎంతో మంది ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించారు. డాక్టర్ ముస్తఫాకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. తన ముగ్గురు పిల్లలను డాక్టర్లుగా తీర్చిదిద్దారు. డాక్టర్ ముస్తఫా చని పోవడం చాలా బాధాకరమని ఆర్ఎంపీలు, పీఎంపీలు అసోసియేషన్ నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళి అర్పించిన వారిలో కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మధు, వెంకట్, రత్నకుమార్, సుభాని తదితరులున్నారు.

మార్చి 6,7 తేదీల్లో వర్సిటీలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగం ఆధ్వర్యంలో మార్చి 6, 7 తేదీలలో నిర్వహించే జాతీయ సదస్సు బ్రోచర్ ను మంగళవారం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. గంగాధరరావు ఆవిష్కరించారు. ఎడ్యుకేషనల్ పర్ స్పెక్టివ్స్ అండ్ రోల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేటర్స్ ఇన్ ఇండియాలి అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య పి. బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు వచ్చిన పరిశోధన పత్రాలు పరిశీలించి పబ్లికేషన్ తీసుకొస్తామని తెలిపారు. వివరాలకు విద్యా విభాగాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు. బ్రోచర్ ఆవిష్కరణ సందర్భంగా రెక్టర్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో విద్యా విభాగం బిఓఎస్ చైర్ పర్సన్ డాక్టర్ శివలక్ష్మి, అతిథి అధ్యాపకులు డాక్టర్ సందీప్, డాక్టర్ వసంతరావు, డాక్టర్ శివరామిరెడ్డి, పరిశోధకులు ఆలీ భాష పాల్గొన్నారు.

రాజకీయనాయకుల పేర్లు చెప్పిఉద్యోగాలిప్పిస్తామని

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - సత్తెనపల్లి

సత్తెనపల్లి నియోజకవర్గంలో రాజకీయ నాయకుల పేర్లు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అమాస భానును సత్తెనపల్లి పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు పట్టణ సీఐ బ్రహ్మయ్య పట్టణ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా సోమల మండలం తప్పన్న గారిపల్లి గ్రామానికి చెందిన ముద్దాయి అమాస భాను, ఏ పవన్ ఏ రాజేష్ చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో గతంలో రాజకీయ నాయకుల వద్ద వీఆర్‌ఓ గా పనిచేసానని, చాలా మంది నాయకులు తెలుసని ఆ పలుకబడితో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మోసం చేశాడు. తరువాత అతని పై చిత్తూరు జిల్లాలోనే పలు కేసు కేసులో నమోదైనవి. తరువాత అతను అటెంప్ట్ టు మర్డర్ కేసులో ఇతన్ని చిత్తూరు జిల్లా, సోమ్లా పోలీస్ స్టేషన్ వారు జైలుకి పంపినారు. తరువాత బెయిల్ పై బయటకు వచ్చినా కూడా అతనిలో మార్పు రాలేదు. ఆ క్రమంలో మరలా గతంలో మాదిరిగానే మరలా ఉద్యోగాలను ఇప్పిస్తానని చీటింగ్ చేస్తూ ఆ క్రమంలో తనకు పరిచయమైనా 2వ ముద్దాయి అయిన నాగమల్లేశ్వరరావుతో పరిచయం ఏర్పడి అతని సపోర్ట్ తో సత్తెనపల్లి నియోజకవర్గంలోని పొలిటికల్ వాట్సన్ గ్రూప్ లలో ఉన్న సభ్యుల ఫోన్ నంబర్లను సేకరించి వారికి ఫోన్లు చేసి



రాజమండ్రి మరియు తిరుపతి రేనుగుంట ఎయిర్ పోర్టులలో జాబ్స్ ఇప్పిస్తానని నమ్మబలికి ఫోన్‌పే ద్వారా డబ్బులు వేయించుకొని జాబులు పేరుతో మోసం చేస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు వచ్చింది. ఈ మేరకు సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కాగా పల్నాడు జిల్లా ఎస్ పి మరియు సత్తెనపల్లి డి.ఎస్.పి ఉత్తర్వుల మేరకు సత్తెనపల్లి టౌన్ సిబ్బంది పై 1 వ ముద్దాయిని ఈనెల 14న బుధవారం పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినారు. గౌరవనీయ కోర్టు వారు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న పట్టణ ఎస్ఐ సంధ్యారాణి మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణ ప్రజలు ఎవరైనా జాబ్స్ ఇప్పిస్తామని తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. సీ సమావేశంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి- రెంటచింతల

ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడగా అందులో ఒక వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండలంలోని తుమ్మరకోట సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంక్రాంతి సందర్భంగా బంధువుల ఆహ్వానం మేరకు గురజాల మండలం దైద గ్రామానికి చెందిన తోట లింగయ్య తుమ్మరకోటకు వచ్చారు తిరుగు ప్రయాణంలో విష్ణువర్ధన్ ఎక్కించుకొని పాలువాయి జంక్షన్‌కు వచ్చిన సమయంలో, షేక్ బాబర్ వలి ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడగా వారిలో లింగయ్య పరిస్థితి విషమంగా ఉంది. తీవ్ర గాయాలైన లింగయ్యను మాచర్ల ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

సాగర్ వైపు నుంచి మాచర్ల పట్టణంవైపు వస్తూ భైరవునిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మాచర్ల పట్టణానికి చెందిన మహంకాళి శ్రీనివాసరావు, భార్య, విజయలక్ష్మి, కుమార్తె నాగేంద్రమ్మ, మనవళ్ళతో కలిసి బైక్ పై వస్తుండగా, భైరవుని పాడు గ్రామ శివారున ఆగివున్న ట్రాక్టర్‌నీ ఢీకొట్టారు. దాంతో వారు కిందపడి గాయాలుపాలైనారు. అటుగా వస్తున్న మాచర్ల రూరల్ సిఐ షేక్ నఫీజ్ బాషా తీవ్ర గాయాలైన విజయలక్ష్మి, నాగేంద్రమ్మను వెంటనే తన డ్రైవర్ హోంగార్డు రవి సహాయంతో పోలీసు వాహనంలో మాచర్ల రవితేజ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం తరలించారు. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

వరుస చోరీలతో రూ.లక్షల్లో దోచుకెళ్లిన దొంగలు

ప్రజాశక్తి - దాచేపల్లి

పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో పదుల సంఖ్యలో ఇళ్లు మంగళవారం రాత్రి చోరీకి గురయ్యాయి. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలోని రెండు మండలాల్లో తాళాలు చేసిన ఇళ్ల నే టార్గెట్ చేసి దొంగలు పడ్డారు. గురజాల పట్టణం లో మూడు ఇళ్లల్లో, గురజాల మండలంలోని పులిపాడు గ్రామంలో ఆరు ఇళ్లల్లో దాచేపల్లి పట్టణంలోని నారాయణపురం లో ఒక ఇంటిలో, నడికుడి, గ్రామంలో నాలుగు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలకు వెళ్లిన ఇళ్లల్లో వరస దొంగతనాలు జరిగడంతో బాధితులు లబోదిబో మంటున్నారు. కొన్ని ఇళ్లకు ఇంకా గృహస్తులు తిరిగి రాకపోవడంతో ఎంత మొత్తంలో నష్టం జరిగింది తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. పలు ఇళ్లల్లో సీసీ కెమెరాలు సైతం ధ్వంసం చేశారు. గ్రామంలోని పలు ఇళ్లలో తాళాలు పగలు కొట్టి ఉండడం చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకొని పోలీసులు రంగంలోకి దిగి విచారణ కొనసాగిస్తున్నారు. దొంగతనాలు ఎలా జరిగాయని తెలుసుకోవడానికి క్లూస్ టీమ్‌ను స్థానిక పోలీసులు రంగంలోకి దింపారు. చోరీ జరిగిన సమీప ఇళ్లల్లోని, వీధుల్లో ఉన్న సిసి పోటేజీలను పరిశీలిస్తున్నారు. వీలైనంత తొందరగా దొంగతనాలకు పాల్పడిన ముఠాలను పట్టుకుంటామని గురజాల డిఎస్పి జగదీష్ తెలిపారు. చోరీ కి గురైన ఇళ్ల కు సంబంధించి ఇంటి యజమానులు లేకపోవడంతో ఎంత సొమ్ము చోరీకి గురైందని విషయం ఇంటి యజమానులు వస్తేనే తెలుస్తుందని అన్నారు. ఈ రెండు మండలాల్లో చోరీకి గురైన ఇళ్లల్లో లక్షల్లో నగదు బంగారం వెండి వస్తువులు పోయి ఉంటాయని స్థానికులు అంటున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉంటారు . గ్రామంలో పెట్రోలు నిర్వహిస్తూ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామాల్లో తిరుగుతున్న సమయంలో ఈ వరుస దొంగతనాలు జరిగాయి. పండుగల సందర్భంగా గ్రామాల్లో నుండి ఊర్లకు వెళ్లే వారు పోలీసులకు సమాచార ఇవ్వాలని పదేపదే చెబుతున్న ఏ ఒక్కరు



కూడా సమాచారం చెప్పకపోవడం వల్ల ఇలాంటి దొంగతనాలకు జరుగుతున్నాయని పోలీసులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో నుండి తీర్థయాత్రలకు, ఫంక్షన్లకు వెళ్లే ఆయా ఇంటి యజమానులు పోలీస్ స్టేషన్ తెలియ పరచాలని పోలీస్ అధికారులు కోరుతున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని చోరీ జరిగిన ఇంటి యజమాని పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - పెదకాకాని

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనకు సంబంధించి బుధవారం పెదకాకాని ఎస్ ఐ మీరజ్ తెలియజేశారు. మండల పరిధిలోని తకెళ్ళపాడు గ్రామములో మంగళవారం జాతీయ రహదారి పక్కన ఒక చెట్టుకు ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి (65) ఉరి వేసుకుని వేలడుతూ ఉండగా అక్కడ వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన ఎడల ఈ నంబర్లకు 8688831350, 8688831352 నెంబర్లలకు సమాచారం ఇవ్వగలరని కోరారు.

సద్దుమణిగిన వివాదం

సంయమనం పాటించండి : అధికారులు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో రజకచెరువు కూడలిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ పై చెలరేగిన ఆందోళనకు అధికారులు ఫుల్ స్టాప్ పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో రజకచెరువు కూడలిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు కమిటీ, కొన్ని ప్రజాసంఘాలు శ్రీకారం చుట్టాయి. దీనికి పురపాలక సంఘం నుంచి కూడా అనుమతులిచ్చినట్లు కమిటీ చెబుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా విగ్రహావిష్కరణకు అనుమతులు లేవంటూ మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసి, నిర్మాణాన్ని అడ్డుకోవడంతో ఆందోళన చెలరేగింది. నిర్మాణ కమిటీతోపాటు పలు ప్రజా సంఘాలు ఆందోళనకు దిగాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తహసిల్దార్, మండల మేజిస్ట్రేట్ కెవి గోపాలకృష్ణ 144 సెక్షన్ విధించారు. బుధవారం ప్రజాసంఘాలు, విగ్రహావిష్కరణ కమిటీతో అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ బి శేషన్న మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించి ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, అన్ని కోణాలను పరిగణాలలోకి తీసుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. అన్ని పరిస్థితులు చక్కబడితే 144 సెక్షన్ కూడా తొలగిస్తామని తహసిల్దార్ వెల్లడించారు. దీంతో సమస్య సద్దుమణిగింది. సమావేశంలో డిఎస్పి బి జనార్ధన రావు, న్యాయవాది విద్యా సాగర్ , బేతాళ ప్రభాకర్, కోడూరి బాబు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, ఎమ్మెల్సీ రాజశేఖర్

యడ్లపాడు మాజీ ఉపసర్పంచ్ ముసలయ్య మృతి



ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడుకు చెందిన మాజీ ఉపసర్పంచ్ కారుచోల చినవెంకయ్య (ముసలయ్య) (76) బుధవారం తెల్లవారుజామున మరణించారు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, సిపిఎం శ్రేణులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కె.రోశయ్య మాట్లాడుతూ 1990 దశకంలో యడ్లపాడులో పంచాయతీ ఉపసర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించి ముసలయ్య గ్రామాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. తుదివరకూ సిపిఎం అభిమానిగా ఉన్నారని చెప్పారు. నివాళులర్పించిన వారిలో సీనియర్ నాయకులు పోపూరి సుబ్బారావు, ఎన్.కాళిదాసు, పుచ్చలపల్లి సుందయ్య స్మారక కళావేదిక కార్యదర్శి ఎం.రామారావు, పుడమి బిల్డర్స్ అధినేత డాక్టర్ ఎం.సురేష్‌బాబు, సిపిఎం మండల కన్వీనర్ జరుగుల శంకరరావు, బి.పీటర్, ఆర్‌సిఎం ఫాదర్ సుబాష్ చంద్రబోస్, బి.ప్రభుదాస్, కె.కోటి, వై.అశోక్, హనుమయ్య ఉన్నారు.



అంగన్వాడీ టీచర్ కుమారి మృతి

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలోని 18వ వార్డుకు చెందిన అంగన్‌వాడీ టీచర్ ఎం.కుమారి (43) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. భౌతికకాయాన్ని సిఐటియు నాయకులు బి.మహేష్, వి.వెంకట్రావులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలికి భర్త, ఒక కుమారుడు, ఒక కుమార్తె కాగా కుమారుడు అనారోగ్య కారణాలతో నెలకిందటే చనిపోయాడు.

హోం గార్డు సుభానీకి అవార్డు

ప్రజాశక్తి-ముప్పాళ్ల



సంక్రాంతి సందర్భంగా పోలీసుశాఖలో అవార్డుల ప్రదానం చేయగా మండల కేంద్రమైన ముప్పాళ్లకు చెందిన హోంగార్డు షేక్ సాతులూరి సుభానికి ఉత్తమ హోంగార్డు అవార్డు లభించింది. సుభాని 20 ఏళ్ల నుండి ప్రతి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తుండడంతోపాటు గ్రామంలో పలు స్వచ్ఛంద సంస్థల సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేవారు. సుభాని చేసిన సమాజ సేవను గుర్తించిన పల్నాడు పోలీసు శాఖ భోగి రోజు అవార్డుల ప్రదానంలో సుభానీకి పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సుభానీని గ్రామస్తులు అభినందించారు.

ధరల పోటు.. నష్టాల ఘాటు

- రేటు పడిపోవటంతో రైతులు దిగాలు
- గతేడాది కంటే క్వింటాళ్‌కు రూ.3 వేల వరకు తగ్గుదల
- అమ్ముకోవాలన్నా రవాణా భారం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్



మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామం కళ్లాల్లోని మిర్చి పంట

మార్కెట్‌లో ధరలు చూస్తుంటే మిర్చి రైతులకు నష్టాల ఘాటు తప్పేలా లేదు. ఇప్పటికే పలువురు రైతులు మిర్చి పంటను ఎందుకు వేశామా అని డీలా పడిపోయారు. గుంటూరు మిర్చి యార్డులో సరైన ధర పలకక, అక్కడ ఉంచలేక, అమ్ముకోలేక పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. కనీసం సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. గతేడాది మిర్చి ధర బాగా పలకడంతో మాచర్ల వ్యవసాయశాఖ ఎడిఎ కార్యాలయ పరిధిలోని మాచర్ల మండలంలో 2,500, వెల్దుర్తి మండలంలో 3,890, దుర్గి మండలంలో 2,593, రెంటచింతల మండలంలో 2,930, గురజాల మండలంలో 3,266 మొత్తం 15,179 ఎకరాల్లో మిరప పంటను సాగుచేశారు. అయితే ధరలు పతనంతో రైతులు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లారు. అప్పులకు వెనుకాడక మిరపసాగు చేసి నష్టాలు మూట గట్టుకుంటున్నామని ఆవేదనకు గురవుతున్నారు.

కంటికి రెప్పలా చూసుకున్నా.. తెగుళ్ల దాడి

మాచర్ల ప్రాంతంలో ప్రధానంగా తేజ, ఆర్మూర్, బంగారం, బుల్లెట్ రకాలను సాగు చేశారు. గతేడాది ఆగస్టు నుంచి మిర్చి సాగు చేపట్టారు. మొక్కలు నాటినప్పటి నుంచి సస్యరక్షణ చర్యలు చేపడుతూ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అయినా పలు తెగుళ్ల సోకటంతో పంటపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపాయి. కాయ దశలో తుపాన్ల ప్రభావంతో కాయపై మచ్చ ఏర్పడింది. దీంతో కాయ నాణ్యత దెబ్బతిని తాలు శాతం పెరిగింది. దిగుబడి తగ్గి ఎకరాకు 15 నుండి 20 క్వింటాళ్లే వచ్చింది.

గతేడాది కంటే సగానికి తగ్గిన ధరలు

ఈ ఏడాడి పంట పెట్టుబడి ఖర్చులు అధికం కావడంతో ఎకరా సాగుకు రూ.లక్షన్నర వరకు ఖర్చయింది. కౌల్దార్లు రూ.18 వేలు కౌలు కింద చెల్లించారు. నిరుడు తేజ రకాలు క్వింటాళ్ రూ.20-22 వేలు, బంగారం, బుల్లెట్ రకాలు రూ. 18-20 వేల వరకు ధర పలికాయి. అయితే 10 రోజుల క్రితం వరకు తేజా రకం మిరప క్వింటాల్ రూ.12 నుండి రూ.13 వేలు వుండేదని, ప్రస్తుతం ఇంకా రూ.3 వేలు తగ్గి రూ.10 వేలు మాత్రమే ధర పలుకుతోందని, బంగారం, బుల్లెట్, ఆర్మూర్ రకాలు రూ.10 వేల నుండి రూ. 8 వేలకు ధరలు పడిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరలకు పంటను అమ్మితే పెట్టుబడి ఖర్చులు కూడా రావని, ఇక అప్పులు ఎలా తీర్చాలని దిగులు పడుతున్నారు.

దుర్గి మిర్చి యార్డులో కోనుగోళ్లు ప్రారంభించాలి

గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి పంటను అమ్ముకోవాల్సి వస్తుందని, బాడిగ ఖర్చులు కూడా భారంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పల్నాడు ప్రాంతంలోని రైతులు తమ పంటలను అమ్ముకోవడానికి అనుకూలంగా ముఖ్యంగా అత్యధికంగా మిర్చి పండించే రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా దుర్గి ప్రాంతంలో మిర్చి యార్డు పెట్టాలని ఉమ్మడి రాష్ట్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. 100 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఆ తరువాత ప్రభుత్వాలు మారి 2020 నాటికి 20 ఎకరాల్లో మినీమిర్చి యార్డు ఏర్పాటైయి అరకొరగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయేగాని పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. మిర్చి నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు, వ్యాపారుల షాపులు నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ఆ భూమి వ్యవహారం కోర్టులో ఉన్నందున ఆ నిర్మాణాలు నిలిచిపోయాయి. యార్డుకు వ్యాపారులను రప్పించి మిర్చి కోనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి పెరిగి.. దిగుబడి తగ్గి..



ఐదెకరాల సొంత పొలంలో మిర్చి సాగు చేశాను. ఈ ఏడాది పెట్టుబడులు పెగిగాయి. తుపాన్ల వల్ల గతేడాదితో పోల్చితే తాలు కాయలు పెరిగాయి. ఎకరాకు నారుకు రూ.25 వేలు, నాటినందుకు రూ.6 వేలు, నీళ్ల మందులు, ఎరువులు కలిపి రూ.60 వేలు, అరకలు, కలుపు, కూలీ ఖర్చులు కలిపి రూ.40 వేలు ఖర్చు వచ్చింది. అయినా ఎకరాకు 15 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. పైగా ఇప్పుడు ధరలు పడిపోవటంతో చేసిన కష్టానికి తగిన ప్రతిఫలం అటుంచితే పెట్టుబడి కూడా దక్కేలా లేదు.

పంగా నాగయ్య, మిర్చి రైతు, కొత్తపల్లి.

అప్పుల వల్ల నష్టానికి అమ్మకం



సొంతపొలం రెండెకరాలకు తోడు కౌలుకు రెండు ఎకరాలు తీసుకుని మిర్చిసాగు చేశాను. ఎకరాకు 17 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నిరుడు క్వింటా మిర్చి రూ.20 వేలు పలికి లాభాలు వచ్చాయి. ఈ ఏడాది బుల్లెట్ రకం రూ.8 వేలకు ధరలు పడిపోయింది. అప్పులు తెచ్చి సాగు చేయటం వల్ల పంటను వెంటనే అమ్మి అప్పులు తీర్చాల్సి వచ్చింది. లేకుంటే ధర పెరిగే వరకు కోల్డు స్టోరేజీలో నిల్వచేసుకునే వాడిని.

వుడిగే వీరయ్య, కౌలురైతు, కొత్తపల్లి.

దుర్గి యార్డులో కొనుగోళ్లు ప్రారంభించాలి



రెండెకరాల కౌలు పొలంలో మిర్చి సాగు చేయగా 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. బాడిగ ఖర్చులు భరించి గుంటూరుకు పోయి పంటను అమ్ముకోవాల్సి వచ్చింది. నడికూడిలో కొనుగోలు చేస్తున్నా అక్కడ వ్యాపారులు సిండికేటయ్యారని తెలిసింది. దుర్గి యార్డులో కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులకు బాడిగ ఖర్చులైనా మిగులుతాయి.

భోజ్యా నాయక్, కౌలు రైతు, కొత్తపల్లి .

సంబరంగా సంక్రాంతి ఆటల పోటీలు



ప్రజాశక్తి - యడ్లపాడు

సంక్రాంతి సందర్భంగా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో మండంలోని లింగారావుపాలెంలో 12, 13, 14 తేదీల్లో ఆటలు పోటీలు నిర్వహించారు. 24 అంశాల్లో కోలాహలంగా జరిగిన పోటీల్లో స్థానికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాస్ మాట్లాడుతూ యువతి, యువకులు సినిమాలు రిలీజ్ సమయాల్లో పెద్దమొత్తంలో టిక్కెట్లు కొని సినిమాలు చూడ్డం కంటే ఇలాంటి సంబరాల్లో కుటుంబీకులతో కలిసి పాల్గొనడం వల్ల ఎక్కువ సంతోషం వస్తుందన్నారు. పిల్లలు సొంతంగా నేర్చుకుని ప్రదర్శన ఇవ్వటం వల్ల వారిలోని సృజనాత్మకత బయటకు వస్తుందని చెప్పారు. సెల్‌ఫోన్ అలవాటైతే భవిష్యత్‌లో అదో పెద్ద సమస్య అవుతుందని, దాన్నుండి పిల్లల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు అందుకు బాగా ఉపయోగపడతాయని, ఈ విషయాన్ని పెద్దలు గ్రహించాలని, పిల్లల్లో శాస్త్రీయ ఆలోచనను పెంచాలని సూచించారు. అనంతరం బహుమతులను నర్రా శ్రీనివాస్‌తోపాటు సర్పంచి షేక్ కరిమూన్, ఆలోకం పెద్దబ్బాయి, నంబూరు నరసింహారావు, ఆలోకం చంద్రశేఖర్, పావులూరి శేషగిరి, కట్ట శ్రీహరి, నూతలపాటి కాళిదాసు, సొంటినేని చంద్రశేఖర్ ప్రదానం చేశారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల





భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మండలంలోని తుమ్మలచెరువు గ్రామం శివాలయం రోడ్డులో ముగ్గులు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, యువకులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కెఎన్‌ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్, మండల అధ్యక్షులు కడియం రోహిత్, మస్తాన్, కడియం వంశీ, కొమ్మ అశోక్, టి.నాగేంద్రబాబు, ఎం.కొండ, చట్టు రమణ, యాసిన్, వేణు, నాగూర్, నజీర్ పాల్గొన్నారు.

న(క)ష్టాల సాగు

సిసిఐ కేంద్రాల్లో నిబంధనల పేరుతో ఇబ్బంది - పత్తి రైతుకు తప్పని నిరాశ



ప్రజాశక్తి - తుళ్లూరు : పత్తి రైతును న(క)ష్టాలు వెంటాడు తున్నాయి. పెరుగు తున్న పెట్టుబడులు, తగ్గుతున్న దిగుబడులు కుంగదీస్తు న్నాయి. ఎన్నో ప్రయాసల కోర్చి పత్తి సాగు చేస్తే చివరకు నష్టాలే మిగులుతున్నాయి. అనను కూల వాతావరణం, దిగు బడితో పాటు ధరలు కూడా తగ్గడంతో పత్తి రైతు కుదే లవుతున్నాడు.కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మండలంలో రెండు శివారు గ్రామాలు కలుపుకుని 21 గ్రామాలుండగా కేవలం మూడు గ్రామాలను మాత్రమే రాజధాని నిర్మాణం నుంచి మినహాయించారు. పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాలను మినహాయించడంతో ఆయా గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో వివిధ పంటల సాగు ప్రక్రియ కొనసాగుతోంది. అత్యధికంగా పత్తి సాగవుతోంది. అకాల వర్షాలు, గులాబీరంగు పురుగు ఉధృతి, ఇతర చీడపీడలు పత్తి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయని రైతులు చెబుతున్నారు. దిగుబడితో పాటు ధరలు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో నిరాశ తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాలు దిగుబడి వస్తుందని ఆశిస్తే కేవలం 10 నుంచి 14 క్వింటాలకు పరిమితమైందని రైతులు చెబుతున్నారు. దిగుబడి తగ్గడంతో పాటు సరైన ధర లభించక పోవడంతో నష్టాలు చవిచూడల్సి వస్తోందని రైతుల వాపోతున్నారు. పత్తి కనీస మద్దతు ధర రూ 7,521లు ఉండగా వ్యాపారులు రూ 6 వేలు నుంచి రూ 6,300, 6400 లకు మించి కొనలేదని, కొంతమంది రూ 5 వేలకు కూడా అమ్ముకున్నారని రైతులు చెబుతున్నారు. ఎకరాకు కౌలు రూ 15 వేలతో కలిపి పత్తి సాగుకు రూ 70 వేల వరకు పెట్టుబడి పెట్టామని, దిగుబడి, ధర లేకపోవడంతో నష్టాలు తప్ప మిగిలిందేమీ లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. గతంలో తాడికొండ వ్యవసాయ మార్కెట్ లో సిసిఐ కొనుగోలు కేంద్రం తెరచి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసేవారని, ఇప్పుడు గుంటూరు వెళ్లి సిసిఐ కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాల్సి రావడం, వ్యయ ప్రయాసల కోర్చి పత్తిని తీసుకువెళితే తేమ శాతం 12 శాతంకు మించి ఉందని కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని వాపోతున్నారు. సిసిఐ కేంద్రానికి రూ.7వేలుపైగా ధర వస్తుందని ఆశపడి వెళితే నిబంధనల పేరుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చేసేది లేక ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ళుగా పత్తి సాగులో నష్టాలు చవిచూశామని, ఈ ఏడాది కొద్దిమందికి దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ఎక్కువ మందికి నిరాశ తప్పలేదని పెదపరిమికి చెందిన రైతు సరిపూడి సాంబశివరావు చెప్పారు. సాధారణంగా పత్తితీతలు ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగాల్సి ఉండగా చాలా మంది రైతులు జనవరి మొదటి వారం లోనే ముగించారని, పత్తి దిగుబడి లేకపోవడమే అందుకు కారణమని ఆయన చెప్పారు. పత్తి చెట్లను పీకివేసి మొక్కజొన్న, మినుము సాగుకు ఉపక్రమిస్తున్నారని ఆయన అన్నారు.



పుస్తకాల కొనుగోలు నిధులు విడుదలపై హర్షం

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా గ్రంథాలయ సంస్థల ద్వారా గత ప్రభుత్వం రచయితలు, కవులు, ప్రచురణకర్తల నుండి పుస్తకాల కొనుగోలు చేసిన బకాయి నిధులను నేటి ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్‌రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ సి.భవానీదేవి, చలపాక ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 2021-2022 సంవత్సరాలలో రచయితలు, కవులు, ప్రచురణకర్తల నుండి పుస్తకాలు కొనుగోలు చేసిందని, దాని నిధుల విడుదల గురించి ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా బకాయిలు (రెండు, మూడు జిల్లాలు మినహా) విడుదల చేయకపోవడంతో రచయితలు, ప్రచురణకర్తలలో గత రెండున్నర ఏళ్లుగా నిరుత్సాహం నెలకొందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొత్త ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని కొత్త సంవత్సరంలో భోగి పండుగ రోజు ఈ పాత బకాయిల నిధులను విడుదల చేసి, రచయితలు/పబ్లిషర్లకు పండుగ కానుకగా వారి ఎకౌంట్లలో జమ చేయడంతో రాష్ట్రంలోని పుస్తక రచయితలలో ఆనందం వ్యక్తం అవుతోంది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మరికొన్ని జిల్లా గ్రంథాలయ సంస్థల నిధులు కూడా విడుదల కావాల్సి ఉందన్నారు. కనుక వాటిమీద కూడా దష్టి పెట్టి ప్రభుత్వం, కవులు/రచయితలు కొత్త పుస్తకాలు వెలువరించేందుకు దోహదపడేలా, కొత్త ఉత్సాహం తీసుకు రావాలని కోరారు. అలాగే రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ నుండి ప్రతి ఏటా కొత్త పుస్తకాలు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టవలసిందిగా కోరుతున్నది.



బహుమతులు అందుకున్న క్రీడాకారులతో నిర్వాహకులు

ప్రజాసంఘాల ఆటల పోటీలకు సంక్రాంతి శోభ



బహుమతి ప్రదానంలో డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్

మంగళగిరిలో పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - మంగళగిరి : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య, అఖిలభారత మహిళా సంఘం, ప్రజానాట్య మండలి, సిపిఎం 1 వ వార్డు శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు మంగళగిరి1,2 వార్డుల్లోని కొత్తపేటలో మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్స్, జూనియర్స్ విభాగంలో మ్యూజికల్ చైర్, రన్నింగ్ , లెమన్ అండ్ స్పూన్, స్లో సైక్లింగ్, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సిపిఎం మంగళగిరి ఒకటో వార్డు శాఖ కార్యదర్శి కుప్పల శ్రీనివాసరావు, కే నాగేశ్వరరావు, సూపూరి వెంకటేశ్వరరావు, జగన్నాథం, వీరబాబు, నిర్మలా కాలేజీ ప్రిన్సిపాల్ వివి ప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి వి వెంకటేశ్వరరావు, కే రమేష్, కే సాయినాథ్, టీ మనోజ్, ఏ వీరయ్య పాల్గొన్నారు.

మూడు, నాలుగు వార్డుల్లో

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మూడు, నాలుగు వార్డుల్లో సంక్రాంతి సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, తదితర ఆటల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డివైఎఫ్ఐ నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధక్షులు డాక్టర్ కె వి ఎస్ సాయి ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ ప్రసంగించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎం నాగేశ్వరావు, ఎస్ వెంకటేష్, ఎస్ గణేష్, ఎస్ చైతన్య, ఏ వీర నాగయ్య, ఎస్ నాగేంద్రబాబు, డి కృష్ణయ్య, ఆర్ వేణు తదితరులు పాల్గొన్నారు.



బహుమతి ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న జవహర్లాల్

క్రీడా నైపుణ్యం పెరుగుతుంది : వ్యకాన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

యువతలో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఆటల పోటీలు ఉపయోగపడతాయని, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈయమని అప్పారావు అన్నారు. మంగళవారం రాత్రి, తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా యువజన సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమం బి ప్రభాకర అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈమని అప్పారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించాలని అన్నారు. యువతను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వమే క్రీడలు నిర్వహించి, యువత పెడదారి పట్టకుండా క్రీడా నైపుణ్యం కోసం కృషి చేయాలని అన్నారు. అంతేకాకుండా యువత దారుఢ్యానికి క్రీడలు అనేవి ఎంతో ఉపయోగమని, మంచి ఆరోగ్యాన్ని క్రీడల ద్వారా పొంద వచ్చని ఆయన అన్నారు. మంగళవారం జరిగిన ఐదు రకాల ఆటల పోటీలలో 180 మంది వివిధ రకాల క్రీడాకారులు పాల్గొన్నారు. సంక్రాంతి ఆటల పోటీలకు స్థానికుల నుండి స్థానికుల నుండి మంచి స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి పట్టణ నాయకులు బూరుగ వెంకటేశ్వరరావు, బి నవనీతం, నీరుడు దుర్గారావు, ఎన్ వంశీ, మహేంద్ర, విజయ్, శ్యామ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఈమని అప్పారావు

పెదకాకాని సుందరయ్య నగర్‌లో..

ప్రజాశక్తి - పెదకాకాని

మండలం కేంద్రమైన పెదకాకానిలోని సుందరయ్య కాలనీలో బుధవారం సిఐటియు ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మహిళల కు ఆటల పోటీలు నిర్యాహించారు. ముగ్గులపోటీ, మూజికల్ ఛైర్స్, లెమన్ స్కూన్ పోటీలు నిర్వహించారు. 100మంది మహిళలు, పిల్లలు పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి జుట్టి రాజలక్ష్మి ద్వితీయ బహుమతి ఎస్.కె షమ్యా తృతీయా బహుమతి ఎస్.కె సుహానా గెలుచుకున్నారు. విజేతలకు మహిళాసంఘం జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ విజేతలకు బహుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ పండుగలన్నిటిల్లో సంక్రాంతికి ప్రత్యేకత వుందని సాంస్కృతిక పునరుజ్జీవనానికి సంక్రాంతినెలవు అని అన్నారు. కార్యక్రమంలో షేక్ మస్తానమ్మ లక్ష్మీకాంతమ్మ కే భాగ్యలక్ష్మి షేక్ బాజిద్ బి బి శరణ్య జి నందిని తదితరులు పాల్గొన్నారు



పెదకాకానిలో విజేతలకు బహుమతి అందజేస్తున్న కె పద్మ

సుందరయ్య నగర్‌లో త్రిపురనేని జయంతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక 41వ డివిజన్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లోని సిహెచ్ హరిబాబు స్మారక భవన్‌లో బుధవారం సిఐటియు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో కవిరాజు త్రిపురనేని రామస్వామి జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు నాయకులు షేక్ మస్తాన్ వలి అధ్యక్షత వహించగా, కాలనీ కమిటీ సభ్యులు కె.ఆంజనేయులు త్రిపురనేని రామస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కెవిపిఎస్ నాయకులు గోనే లూథర్‌పాల్ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే కర్మ సిద్ధాంతానికి వ్యతిరేకంగా, కులమతాలకు అతీతంగా మనుషులను మనుషులుగా గౌరవించాలని, హేతువాద భావజాలంతో కవిత్వాన్ని రాయడమే కాకుండా సమాజంలో ఉన్న సాంఘిక, ఆర్థిక అసమానుతులకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి అని అన్నారు. ఆ రోజుల్లోనే కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా తన పేరులో ఉన్న చౌదరి అనే పదాన్ని కూడా తిరస్కరించిన గొప్ప దార్శనికుడని, అలాంటి వ్యక్తి జీవితం అందరికీ మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు నాయుడు పద్మ, అచ్యుత కుమారి, మురళి, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

గ్రామీణ క్రీడలకు విశేష స్పందన

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండల కేంద్రంలోని కొల్లా వెంకయ్య మెమోరియల్ గ్రంథాలయం ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఏర్పాటుచేసిన గ్రామీణ క్రీడా పోటీలు మంగళవారం రాత్రి తో ముగిసాయి. 13 విభాగాలలో ఆటల పోటీలు జరిగాయి. ప్రతి పోటీకి ప్రథమ, ద్వితీయ, తతీయ మరియు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. నిర్వహకులు డాక్టర్ కొల్లా రాజ మోహన్ రావు మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యానికే కాక, మానసిక వికాసానికి తోడ్పడతాయని, గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తూ గత 25 సంవత్సరాలుగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగటానికి విద్యతోపాటు క్రీడలు కూడా ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడా పోటీలలో కర్ర సాము ఆకర్షణగా నిలిచింది. శ్రీ శ్రీ గేయాలు అలరించాయి. ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహనీయుల ఫోటోల గుర్తింపు పోటీ ఈ ఏడాది ప్రత్యేకంగా నిలిచింది. బహుమతుల ప్రధాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రావి శివరామకష్ణయ్య మాట్లాడుతూ మరుగున పడిపోతున్న గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తూ రాజ మోహన్ రావు గత 25 సంవత్సరాలుగా క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఆటల పోటీలలో పాల్గొన్న అందరికీ అభినందనలు తెలిపారు. యార్లగడ్డ అంకమ్మ చౌదరి మాట్లాడుతూ క్రీడలలో గెలుపు, ఓటములు సహజమని ప్రయత్నించటమే విజయానికి పునాది అని తెలిపారు. నేటి బాలలు క్రీడలకు దూరమవుతున్నారని, ఈ పోటీల ద్వారా అయినా క్రీడల మీద ఆసక్తి పెంచుకోవాలని కోరారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతుల ప్రధానం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొల్లా అమర్ , కొల్లా హేమంతి దేవి, కొల్లా భాగ్యమాల, మక్కెన జవహర్ రాణి, నన్నపనేని వెంకట్రావు, కొల్లా వెంకయ్య చౌదరి, రామన్, జగదీష్, నిర్మల, సుజయ్, డి శ్రీను, సిహెచ్ శ్రీనివాస్, చెవుల రాము, నిమ్మగడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై 'స్మార్ట్' భారం!

- ఇప్పటికే ట్రూ అప్, ఇతర సర్‌చార్జీల పేరిట బాదుడు
- పెరిగిన విద్యుత్తు బిల్లులతో వినియోగదారుల బెంబేలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విద్యుత్ బిల్లుకు లెక్కాపత్రాలు లేకుండా వసూలు చేస్తున్నారు. అసలే పెనాల్టీలు.. దానికి తోడు ఎఫ్.పి.పి, సి.ఏ.చార్జీలు వేసినవే వేస్తూ.. వినియోగదారుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. దీనికితోడు మరికొద్ది రోజుల్లో స్మార్ట్ మీటర్ల భారం కూడా వినియోగదారులపైనే పడనుంది. పట్టణ, నియోజకవర్గ స్థాయిలో ప్రస్తుతానికి డిజిటల్ మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు బిగింపు రెండు, మూడు నెలల్లో ముగుయనున్నది. దీంతో సెల్‌ఫోన్ బిల్లులాగా విద్యుత్ బిల్లులు కూడా ప్రీపెయిడ్ రూపంలో రానున్నాయి. దీని ద్వారా పేద, నిరుపేద, మధ్య తరగతి వారిపై స్మార్ట్ మీటర్ల భారం పడనుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రజలు డిజిటల్ మీటర్లకు ముందుగా డిపాజిట్లు చెల్లించి ఈ మీటర్లు తీసుకున్నారు. ఇప్పుడు ఆ స్థానంలో స్మార్టు మీటర్లు బిగిస్తున్నారు. డిజిటల్ మీటర్లకు కట్టిన డిపాజిట్ల పరిస్థితి ఏమిటంటున్నారు. ఇప్పటికే 2022వ సంవత్సరంలో వాడుకున్న బిల్లులు, ఎఫ్‌పిపి, సిఏ చార్జీలు, యూజర్ చార్జీలు, అదనపు చార్జీలంటూ ఏవేవో కలిపి బాదేస్తున్నారని వాపోతున్నారు. ప్రస్తుతానికి వాడుకున్న విద్యుత్‌కు కాగితం రూపంలో బిల్లులు ఇస్తున్నారని.. ఆ బిల్లులను పది రోజులు తరువాత కట్టే సౌకర్యం ఉందని, కాకపోతే పెనాల్టీతో రెండు మూడు నెలల తర్వాత అయినా కట్టే సౌకర్యం ఉందని, ఈ స్మార్ట్ మీటర్లు బిగిస్తే విద్యుత్ బిల్లులు చిప్పుల ద్వారా ముందుగానే ఎదురు పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందంటున్నారు.

కనీసం స్మార్ట్ మీటర్ల ఖరీదు ప్రభుత్వం భరించాలని వినియోగదారులు కోరుతున్నారు.



బిల్లులో వ్యత్యాసం



మీటరు



దేశరక్షణలో జవాన్ల త్యాగం ఎనలేనిది

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దేశరక్షణలో ప్రాణాలకు తెగించి పోరాడుతున్న ఆర్మీ జవాన్లకు సాటి మరొకరు లేరని రోటరీ క్లబ్ చిలకలూరిపేట అధ్యక్షులు ఆళ్ల వేమనరెడ్డి అన్నారు. ఆర్మీ డే సందర్భంగా లెఫ్టినెంట్ కల్నల్ ముద్దన సాంబశివరావును బుధవారం యడ్లపాడు మండలం జగ్గా పురం గ్రామంలో క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, తోటకూర వెంకట నారాయణ, జి.సాంబశివ రావు, చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గార్డ్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుదవారం ఆ సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గార్డ్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, కార్యదర్శి పోనుగుబాటి బుల్లిబాబు, మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు దాసరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా 'గాదె' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - దాచేపల్లి

పట్టణంలోని జనసేన కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షులు పాముల కిషోర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు కోట మధు, వెంకట నర్సమ్మ, బత్తుల వెంకయ్య, బండ్ల రమేష్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడంలోనే సంతృప్తి

ప్రజాశక్తి - మాచర్ల

పేదల ఆకలి తీర్చడంలోనే నిజమైన సంతృప్తి ఉందని స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు.బుధవారం బస్టాండ్ ఆవరణలో పేదలకు అన్నదానం చేశారు. శ్రీ శారద మాత నారాయణ సేవలో భాగంగా సుమారు ఎనిమిదేళ్లుగా బస్టాండ్, రైల్వేస్టేషన్, దేవాలయాల వద్ద వృద్ధులు, యాచకులు, అనాథలకు నిత్యం మూడు పూటలా అన్నదానం చేస్తున్నట్లు ఆయన వివరించారు.



క్రీడలకు ప్రోత్సాహం

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
- గ్రామాల్లో ఘనంగా సంక్రాంతి వేడుకలు
- పలు ప్రాంతాల్లో ఆటలు, ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-ఈపూరు

ఎన్డీఏ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడంతోపాటు, క్రీడాభివృద్ధికి కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో రైతు మిత్ర 33వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని, రైతు మిత్ర కమిటీగా ఏర్పడి 33 ఏళ్లపాటు కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన క్రీడాకారులను పరిచయం చేసుకొని రావిపాడు, స్కై జట్లతో కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆనంద్ సినీ ఫేమ్ హీరో రాజా వేర్వేరుగా కబడ్డీ పోటీలకు హాజరై, క్రీడలను టాస్ వేసి ప్రారంభించారు. ఈ నెల 12 నుంచి జరుగుతున్న కబడ్డీ పోటీలలో ఇండియన్ నేవీ-బిఎం టీసీ (కర్ణాటక), రావిపాడు- స్కై, టాస్ (ఎస్వీఎస్)-హర్యానా, సత్తెనపల్లి-వెంకట్ యువసేన (తమిళనాడు), హనుమాన్ క్లబ్ (పంజాబ్)-జీవి యువసేన (ఏ ముప్పాళ్ల), ఎస్వీఎస్ (ఏ ముప్పాళ్ల)-ఝార్ఖండ్ జట్లు లీగ్‌లోకి ప్రవేశించినట్లు కమిటీ నిర్వాహకులు తల్లపనేని రామారావు తెలిపారు.







క్రోసూరులో సంక్రాంతి ముగ్గుల పోటీలు

క్రోసూరు : మండలంలోని దొడ్లేరు గ్రామంలో మొగల్ జాను బ్రదర్స్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొత్తం 60 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

దాచేపల్లి : మండలంలోని పెద్దగార్లపాడు గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు, టిడిపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వరలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులను అందజేశారు. నాయకులు పాముల కిషోర్, కోరే రామారావు తదితరులు పాల్గొన్నారు. పండగ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ఉత్సాహభరితంగా సాగాయి. మొత్తం 35 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలతోపాటు, మెమెంటోలు అందజేశారు.

రోటరీ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

మాచర్ల రూరల్ : లెప్రసీ కాలనీ వాసులు కూడా పండగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ తమ వంతు సహకారంగా 300 కిలోల బియ్యం, 50 కేజీల కందిపప్పును రోటరీ క్లబ్ ప్రతినిధులు పంపిణీ చేశారు. వివిధ వర్గాలను ఆదుకునేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొండవీటి కృష్ణకుమారి, నిమ్మగడ్డ సురేఖ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ ప్రతినిధులు డాక్టరు రామకోటయ్య, ఐ.శంకర్, తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, నాగార్జునరెడ్డి, సాంబశివరావు, ఆడిటర్ మస్తాన్‌వలి, పఠాన్ నాగూర్‌వలి, రవి పాల్గొన్నారు.



అన్యాయంగా ఇల్లు కూల్చేశారు..

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణ శివారులోని మేరిమాత విగ్రహం వెనుక ఉన్న తమ ఇల్లును అర్ధరాత్రి సమయంతతతలో కొందరు వ్యక్తులు అన్యాయంగా కూల్చివేశారంటూ పట్టణానికి చెందిన కొమ్ము ఆనందరావు అనే వ్యక్తి బుధవారం కుటుంబ సభ్యులతో సహా కూల్చేసిన ఇంటి వద్ద టెంట్ వేసి.. న్యాయం కోసం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ తన పూర్వీకుల నుంచి తనకు వచ్చిన ఆస్తిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో 2020 సంవత్సరంలో కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకొని 14సెంట్ల స్థలంలో నివాసం, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో కొందరు వ్యక్తులు వచ్చి తనపై దాడి చేసి.. ఇంటిని, వ్యాపార సముదాయాన్ని దౌర్జన్యంగా కూల్చివేశారని ఆరోపించారు. ఇప్పుడు తన కుటుంబం రోడ్డుపై పడిందని, సుమారు 25లక్షల రూపాయిల ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఇదే విషయమై పోలీసు అధికారులను సంప్రదించగా.. పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



వైభవంగా శ్రీలక్ష్మీ, చెన్నకేశవస్వామి కల్యాణం

ప్రజాశక్తి- మాచర్ల

చారిత్రక ప్రాశ్యస్త్యం గల శ్రీలక్ష్మీ, చెన్నకేశవస్వామి వార్ల కల్యాణం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా సాగింది. చెన్నకేశవస్వామికి ఏటా రెండుసార్లు కల్యాణోత్సవం జరపడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ఒకటి చైత్ర పౌర్ణమి రోజున కాగా.. సింగం వంశస్థులు మరోసారి మకర సంక్రాంతి పర్వదినాన జరుపుతారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామిని పెండ్లి కుమారుడిని చేసి ఆలయం నుంచి గజారోహణ వాహనంపై తీసుకురాగా.. శ్రీలక్ష్మి దేవి పెండ్లికుమార్తెగా సూర్యప్రభ వాహనంలో లక్ష్మీదేవి విచ్చేశారు. లక్ష్మీదేవి మిద్దెల వద్ద వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి కల్యాణాన్ని కన్నులపండువగా జరిపించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

రొంపిచర్ల పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 2007-08 ఏడాది 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల రోజుల్లో మధుర జ్ఞాపకాలను మిత్రులంతా మరోసారి జ్ఞప్తికి తెచ్చుకుని, ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పి తాము మంచి స్థాయికి రావడానికి కారకులైన ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మూర్తి, ఏడుకొండలు, శ్యాంసన్, బాలరాజు, ప్రభాకరరావు, కొండలరావు, కోటేశ్వరరావు, అనిత, సునీత తదితర ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

దయనీయంగా తుళ్లూరు బస్టాండ్

> పేరుకే రాజధాని.. కనీస సౌకర్యాలు శూన్యం
> మరుగుదొడ్లు లేక మహిళా ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి - తుళ్లూరు

పేరుకే రాజధాని.. కనీస వసతులు శూన్యం.. నిరుపయోగంగా మరుగుదొడ్లు.. తాగునీరు కరవు.. శిథిలావస్థకు చేరిన భవనాలు.. పెచ్చులూడుతున్న శ్లాబ్... ఇదీ, రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు ఆర్‌టీసీ బస్టాండ్ దయనీయ పరిస్థితి. ఇక్కడ బస్టాండ్ మీదుగా అమరావతి-విజయవాడ, తుళ్లూరు - గుంటూరుతోపాటు సచివాలయం, హైకోర్టుకు బస్సుల రాకపోకలు సాగుతుంటాయి. బస్టాండ్‌లో కనీస వసతులు లేకపోవడంతో 'పేరుకే రాజధాని.. పేరు గొప్ప - ఊరు దిబ్బ' అన్న చందంగా ఉందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మరుగుదొడ్లు లేక మహిళా ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మరుగుదొడ్లు ఉన్నా.. వాటర్ ట్యాంకులు, పైపులు పాడవ్వడంతో నీరు సరఫరా కావడం లేదు. తాగునీరు దొరకదు, ఫ్యాన్లు పని చేయవు.. ఇలా ఇక్కడ ప్రతిదీ



పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

సమస్యగానే మారింది. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఆర్‌టీసీ అధికారులు పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ట్యాంక్ మరమ్మతులతోపాటు, మరుగుదొడ్లలోకి నీరు



సక్రమంగా సరఫరా అయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నెలలు గడుస్తున్నా అధికారులు చెప్పిన మాటలు కార్యరూపం దాల్చలేదు. సమస్య 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా మారింది. బస్టాండ్ నిర్మాణానికి 1977లో అప్పటి రోడ్డు రవాణా శాఖ మంత్రి చేబ్రోలు హనుమయ్య శంకుస్థాపన చేయగా.. 1981లో కొణిజేటి రోశయ్య ప్రారంభించారు. నేటికి నిర్మాణం జరిగి నాలుగు దశాబ్దాలుపైగా కావడంతో భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. పెచ్చులు నెత్తినపడతాయేమోనని ప్రయాణికులు హడలిపోతున్నారు. ఆర్‌టీసీ అధికారులు తక్షణమే స్పందించి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చిరునవ్వుల చిరంజీవి 'జంధ్యాల'

ప్రజాశక్తి-గుంటూరు

'అవగాహన' ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో బుధవారం సినీ దర్శకులు జంధ్యాల జయంతిని నిర్వహించారు. హాస్య చిత్రాల దర్శకుల్లో అగ్రగణ్యుడు జంధ్యాల అని.. హాస్యంతోపాటు, తెలుగు సంస్కృతీసంప్రదాయాలకూ అంతే ప్రాధాన్యమిచ్చిన గొప్ప దర్శకుడు అని ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ అన్నారు. 'నవ్వడం ఒక భోగం, నవ్వించడం యోగం, నవ్వలేకపోవడం ఒక రోగం' అన్న జంధ్యాల మాటలు తెలుగుదేశం మొత్తం మారుమోగాయన్నారు. చిరు నవ్వుల చిరంజీవి, నవ్వుల నెలరాజుగా ఆయన ప్రసిద్ధిగాంచారన్నారు. తన కలంతో నవ్వులను చిలకరించి నాటకాలు, సినిమాలు, టెలిఫిలింలలో నవ్వుల మూటలు కట్టి అనేక హాస్య పండుగలు అందించారన్నారు. తొలి చిత్రం ముద్ద మందారం నుంచి చివరి చిత్రం వరకు సునిశిత హాస్యంతో పలు పాత్రలకు రూపకల్పన చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రంగస్థల నటులు పి.ఘనశ్యామాచార్యులు, మిమిక్రీ, మ్యూజిక్ కళాకారుడు ఆర్‌పి.ఎల్.నరసింహారావు, గాయకులు రామకృష్ణారెడ్డి, అంకమ్మరావు, ప్రసాదరావు, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న పితాళ్ల మస్తాన్‌రావు

ప్రజాశక్తి-మంగళగిరి

ప్రముఖ పారిశ్రామికవేత్త, న్యాయవాది పితాళ్ల మస్తాన్‌రావు తెలుగుదేశం పార్టీలో లక్ష రూపాయల జీవిత సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. తాను 1995 నుంచి తెలుగుదేశం పార్టీలో ఉన్నానని తెలిపారు. నారా లోకేష్ భారీ మెజార్టీతో గెలిచి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మంగళగిరిని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీని ఆయన మరింత బలోపేతం చేసేందుకు చేస్తున్న కృషి తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. ఈ నేపథ్యంలో తాను పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించినట్లు చెప్పారు.



పండగ రోజుల్లోనూ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ 43 రోజులుగా రిలే దీక్షలు చేపడుతున్న ఏసీసీ కార్మికులు.. పండగ రోజుల్లోనూ తమ ఆందోళన కొనసాగించారు. 32 సంవత్సరాల నుంచి సిమెంట్ కంపెనీ కార్మికులు నష్టపరిహారం కోసం ఎదురు చూస్తూ, అర్ధాకలితో అలమటిస్తున్నారని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు తెలిపారు. బుధవారం దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల కార్మికులకు పండగ సంతోషం



లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏసీసీ కార్మికుల పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు. దీక్షల్లో ఎస్‌కే సుభానీ, బి.సూర్యప్రకాష్, ఎస్‌కే ఇమాంబి, బి.నవనీతం, విజయలక్ష్మి కూర్చొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-మంగళగిరి

మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. నాలుగో రోజు బుధవారం పశ్చిమగోదావరి, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ప.గో.జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి కర్నూలు జట్టు ఫీల్డింగ్ తీసుకోగా.. పశ్చిమగోదావరి జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగుకు దిగిన కర్నూలు జట్టు 153 పరుగులకే కుప్పకూలింది. గుంటూరు, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో.. తొలుత బ్యాటింగు చేసిన గుంటూరు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. 146 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 7



వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసి ఓటమి చెందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఆటగాళ్లకు పట్టణ తెలుగు యువత అధ్యక్షులు భోగి వినోద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.10 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు.

హేతువాద రచయిత రామస్వామి చౌదరి

ప్రజాశక్తి - తాడికొండ

స్వాతంత్ర్య సంగ్రామంలో త్రిపురనేని రామస్వామి చౌదరి కీలక పాత్ర పోషించారని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవరణలో బుధవారం రామస్వామి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ హేతువాద రచయిత, సంఘసంస్కర్త, సామజిక దురాచారాలపై



ఉద్యమించిన స్వాతంత్ర్య సమరయోధుడు రామస్వామి చౌదరి అని అన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో ప్రజలను ఉత్తేజపరిచే అనేక దేశభక్తి గీతాలను రచించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ బి.శ్రీలక్ష్మి, కంట్రోలర్ బివిఎస్ ప్రసాద్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

సంక్రాతి పండగను పురస్కరించుకొని, తాడేపల్లి పట్టణ పరిధిలోని విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం మ్యూజిక్ చైర్, లెమన్ స్పూన్, సీనియర్, జూనియర్ విభాగంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు తెలుగుదేశం పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు బహుమతులు అందజేశారు. మంగళగిరి



నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, సీనియర్ నాయకులు మండవ గోపాలరావు, అద్దంకి మురళి, మాజీ చైర్మన్ కొయ్యగూర మహాలక్ష్మి, మాజీ కౌన్సిలర్ నిర్మల, అన్నెం కుసుమ తదితరులు పాల్గొన్నారు.



రాజధాని అసైన్డ్ రైతుల సంబరాలు

ప్రజాశక్తి -తుళ్లూరు

రాజధాని ప్రాంత అసైన్డ్ రైతులు సంబరాలు జరుపుకొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన అసైన్డ్ రైతులకు కౌలు సొమ్ము చేతికి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బుధవారం రాయపూడిలో అమరావతి దళిత బహుజన జెఎసి కన్వీనర్ చిలకా బసవయ్య, మరికొందరు అసైన్డ్ రైతులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వం కౌలు చెల్లించి దళిత, ఇతర పేద వర్గాలకు చెందిన అసైన్డ్ రైతుల కుటుంబాలలో పండుగ తెచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. తుళ్లూరులోని టిడిపి కార్యాలయంలోనూ సిఎం, డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.



క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-మంగళగిరి

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రోటరీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో సంక్రాంతి పండగ సందర్భంగా జరుగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్-2025ను రోటరీ క్లబ్ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా మంగళగిరి జట్టు సభ్యులకు 35 జతల క్రీడా బూట్లను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అందె మురళీమోహన్, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, అనిల్ చక్రవర్తి, పారేపల్లి నిరంజన్ గుప్తా, అందె రేవంత్ కుమార్, కేలావత్ సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-దుగ్గిరాల



మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామ శివారులో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం పునర్ నిర్మాణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో గుంటూరుకు చెందిన భక్తులు మునగాల సత్యనారాయణరెడ్డి ఆలయ నిర్మాణం నిమిత్తం బుధవారం ట్రస్టీ దేవభక్తుని రంగ ప్రసాద్‌కు లక్ష 116 రూపాయలు విరాళంగా అందించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.సునీల్ కుమార్ తెలిపారు.



ప్రభుత్వ పాఠశాల 75 ఏళ్ల వేడుకకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-పెదనందిపాడు

పాలపర్రులోని శ్రీ నారసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులంతా సహాయ సహకారాలు అందిద్దామని పూర్వ విద్యార్థి డాక్టర్ ముద్దన రమేష్, డాక్టర్ చిట్టినేని శివ కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో పాఠశాల 75 సంవత్సరాల వేడుకల సన్నాహక సమావేశం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పూర్వ విద్యార్థులంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మే నెలలో 75 ఏళ్ల నిర్వహించాలని, ఈ సందర్భంగా సావనీర్ ముద్రించాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థి, కె.ఎల్.యూనివర్సిటీ ప్రొఫెసర్ దుద్దెంపూడి మల్లయ్య రూ.70 వేల విలువైన సైన్స్ ల్యాబ్ పరికరాలను అందజేశారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-మంగళగిరి

స్థానిక శ్రీ కృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు మాతృమూర్తి వాకా భారతి వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, టీడీపీ నాయకులు గోవాడ దుర్గారావు, అన్నం నాగబాబు, చింతా వెంకటేశ్వరరావు, రుద్రు మురళీకష్ణ, యేమినేని దుర్గ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య నగర్, మహానాడులో ..

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



సుందరయ్య నగర్ సిఐటియు కార్యాలయం వద్ద విజేతలతో తాడేపల్లి ఎస్ఐ నారాయణ

సంక్రాంతి, భోగిలను పుంస్కరించుకొని, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాల ఆటల పోటీలు తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్, మహానాడు ప్రాంతాలలో ఘనం గా నిర్వాహకులు నిర్వహిం చారు. రెండు ప్రాంతాలలో మొత్తం నాలుగు చోట్ల 550 మంది ఈ ఆటల పోటీలలో మహిళలు, యువతి, యువకులు చిన్నారులు ఉత్సాహపూరితమైన వాతావరణంలో పాల్గొన్నారు. 13వ తేదీ భోగి రోజున బత్తుల రాజు భవన్ వద్ద జరిగిన ఆటల పోటీల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి తాడేపల్లి ఎస్సై నారాయణ, ఆటోనగర్ ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వై సుబ్బారావు, ముక్కు రాజులు ముఖ్య అతిథులుగా పాల్గొని , ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం బాలికల కోలాటం, డాన్సులు, విచిత్ర వేషధారణ పోటీలు కోలోహాలంగా 200 మందితో జరిగాయి. 14వ తేదీ మంగళవారం తాడేపల్లి లోని సుందరయ్య నగర్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య కళావేదిక వద్ద 500 మందితో బహుమతి ప్రధానోత్సవ సభ ఎస్ వెంకట్రావు అధ్యక్షతన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ బాబు, సుకుమార్ రెడ్డి, ఎంబివికె కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, ప్రజానాట్యమండలి నాయకులు దేవేంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొని, ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం 500 మందితో మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొని, కోలాటాలు, డాన్సులు, చిరు నాటికలతో, విచిత్ర వేషధారణలతో ప్రధాన ఆకర్షణగా నిలిచి, ఆకట్టుకున్నారు. అంతేకాకుండా వివిధ రకాల పలు సాంస్కృతి కార్యక్రమాలు అబ్బురపరిచే విధంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మార్క్సిస్ట్ మాసపత్రిక ఎడిటర్ ఎస్ వెంకట్రావు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు ఆర్.వి రాఘవయ్య, కొట్టే కరుణాకర రావు, సిఐటియు నాయకులు సిహెచ్ భుజంగరావు, శేఖర్, పి రామచంద్రరావు, నారిన నాగేశ్వరరావు,మహిళా సంఘం కార్యదర్శి జ్యోతి, పి గిరిజ, సుధా, సంఘవి, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


రీల సుందరయ్య కళావేదికపై బహుమతులు అందజేస్తున్న రమేష్ బాబు, సుకుమార్ రెడ్డి, పిన్నమనేని మురళీకృష్ణ, రంగమణి, దేవేంద్ర తదితరులు

ఉత్సాహంగా...ఉల్లాసంగా..

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆటలపోటీలు

భారీగా హాజరైన ప్రజలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



మంగళగిరి మండలం కాజా గ్రామంలో సింహాద్రి బసవ పున్నయ్య, అవుతు నాని, బుల్లా సందీప్ స్మారక సంక్రాంతి ఆటల పోటీలు అప్పికట్ల శ్రీని వాసరావు మాస్టర్, ఆర్ధల సూర్యనారాయణ క్రీడా ప్రాంగణంలో గత నాలుగు రోజులు పాటు ఉత్సాహపూరితంగా జరిగాయి. కాజా గ్రామ డివైఎఫ్ఐ ఐద్వా గ్రామ కమిటీల ఆధ్వర్యంలో గత నాలుగు రోజులు పాటు ఎంతో ఉత్సాహంగా సంక్రాంతి ఆటల పోటీలు జరిగాయి. ముగింపు సందర్భంగా జరిగిన విజేతల బహుమతి ప్రధానోత్సవ సభకు ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కెవిఎస్ సాయి ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటలు యువతకు ఎంతో అవసరమని సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులను యువతను పేడధోరణుల







కాకుండా సన్మార్గం లో నడిపించే విధంగా ఉండాలని సూచించారు. ప్రముఖ శస్త్ర వైద్య నిపుణులు జడ మాబు మాట్లాడుతూ మానవ సంబంధాలు ఎంతో విలువైన మని



వాటిని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని, పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈదా ప్రతాపరెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కె కృష్ణకాంత్, ఐద్వా మండల కార్యదర్శి సింహాద్రి విజయలక్ష్మి, నాయకులు సింహాద్రి సుమ, ఆర్తల శ్యామల జ్యోతి, దోసపాటి నరసింహారావు సిపిఎం నాయకులు అప్పికట్ల ప్రకాష్ రావు, భీమిరెడ్డి కోటేశ్వరి, డివైఎఫ్ఐ నాయకులు సింహాద్రి ఆదిశేకర్ అర్ధల సాంబశివరావు, బొమ్మ త్రికేశ్ రెడ్డి, ఈదా వంశీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అంద జేశారు. ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న సంక్రాంతి ఆటల పోటీలతో పాటు క్రికెట్ పోటీలను ఈ సంవత్సరం అవుతూ నరేంద్ర రెడ్డి జ్ఞాపకార్ధంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



సంక్రాంతి సందర్భంగా ఆత్మకూరు గ్రామంలోని నిమ్మగడ్డ రామ్మోహన రావు నగర్లో ఐద్వా, వ్యాకాస, ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం, చేనేత కార్మిక సంఘం, ఆత్మకూరు గ్రామ కమిటీల ఆధ్వర్యంలో 14వ తేదీ మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామస్థాయి సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించారు ముగ్గుల పోటీ, మ్యూజికల్ చైర్స్, తాడట, బాస్కెట్లో బాల్ వేయుట, షటిల్, రన్నింగ్, వికెట్ కొట్టుట, సైకిల్ స్లో, నిమ్మకాయల ఆటల పోటీల జరిగినాయి. అనంతరం సాయంత్రం 6 గంటలకు బహుమతుల ప్రధానోత్సవం సభలో రైతు సంఘం నాయకులు ముసలి పకీరయ్య బహుమతులు అందజేసి మాట్లాడారు. పండుగ రోజుల్లో దానధర్మాలు చేసే రైతుకు నేడు ఆ పరిస్థితి లేదన్నారు. మన సంస్కృతులు సాంప్రదాయాలు కనుమరుగైపోతున్న నేటి పరిస్థితుల్లో గ్రామంలో అనేక సంవత్సరాల నుండి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వుద్దంటి దుర్గారావు నల్లక శ్రీధర్ పండల ప్రసాద్ చిట్టేల సీతారామాంజనేయులు గడ్డం అజయ్ కుమార్ మునగాల సంధ్య కోడూరు సుజాత లక్ష్మి చిట్టేల జనార్ధన రావు శర్మ మునగాల శ్రీను రాంబాబు బాబ్జి సుబ్రహ్మణ్యం సురేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న డాకు మహారాజ్ చిత్రం యూనిట్

డాకు మహారాజ్ చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో బుధవారం డాకు మహారాజ్ చిత్ర యూనిట్ సందడి చేసింది. నందమూరి బాలకృష్ణ హీరోగా నటించి ఈ చిత్రాన్ని ఫినిక్స్ మాల్లో డాకు మహారాజ్ సినిమా దర్శకుడు బాబీ కొల్లి, సంగీత దర్శకులు ఎస్ఎస్.థమన్ తిలకించారు. సినీ యూనిట్తో కలసి ఫినిక్స్ మాల్కు వచ్చారు. థియేటర్ మరియు ఫుడ్ కోర్ట్ యాజమాన్యం టీమ్ సభ్యులకు ఘనస్వాగతం పలికారు. సినిమా ప్రేక్షకులలో మంచి టాక్ తెచ్చుకొని డీసెంట్ కలక్షన్లు రాబడుతోంది. ఈ కార్యక్రమంలో ఫుడ్ కోర్ట్ యాజమాన్యం దాసరి శ్రీకాంత్, కడంశెట్టి సతీష్, గ్రంథి వెంకటేష్ అభిమానులు పాల్గొన్నారు.అంతకు ముందు రింగ్ రోడ్డులో వెల్కమ్ హెూటల్ నుంచి రోడ్డులోని ఫినిక్స్ మాల్ వరకు అభిమానులతో కలిసి ర్యాలీగా వెళ్లారు. అనంతరం మైత్రి మూవీస్లో కలిసి డాకు మహారాజ్ చిత్రాన్ని తిలకించారు. అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని బాబీ గుంటూరుకు చెందిన వ్యక్తి కావడంతో బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కోర్ట్ యాజమాన్యం దాసరి శ్రీకాంత్, కడంశెట్టి సతీష్, గ్రంథి వెంకటేష్ మరియు అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకులు కొల్లిబాబీ, తమన్ మాట్లాడుతూ ఈ చిత్రానికి మొదటి రోజు రూ.56 కోట్లకు పైగా వసూళ్లు రాగా... రెండో రోజు రూ.74 కోట్లకు పైగా కలెక్షన్స్ వచ్చాయన్నారు. అలాగే బాలయ్య కెరీర్లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్ రాబట్టిన చిత్రంగానూ 'డాకు మహారాజ్' నిలిచిందన్నారు. ఈ మూవీలో బాలకృష్ణ సరసన శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్, ఊర్వశి రౌతేలా హీరోయిన్లుగా నటించారు. ఎస్ఎస్ తమన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్ మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ నిర్మించారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు


పాతగుంటూరులో ఆటల పోటీల్లో పాల్గొన్న బాల, బాలికలు

అంబేద్కర్ నగర్లో ..

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అంబేద్కర్ నగర్ మెయిన్ రోడ్డులో సంక్రాంతి సందర్భంగా ఐద్వా, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. స్లో సైక్లింగ్, రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్ వంటి వివిధ పోటీల్లో పిల్లలు ఉత్సాహహంగా పాల్గొన్నారు.అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు, ఆటలు, పాటల్లో ముందు ఉండాలని అన్నారు. ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణ, ఎ.కళ్యాణి మాట్లాడుతూ బాలికలను విద్యలో ప్రోత్సహించాలని అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కె.పద్మ పాటలు పాడారు.

విజేతలకు షాప్ ఎంప్లాయిస్ యూనియన్ నగర నాయకుల సౌజన్యంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి టి.రాధ, సృజన, సంధ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.సుబ్బరాయుడు, ఖాజా, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పాతగుంటూరులో...

సంక్రాంతి పండుగ సందర్భంగా ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో పాతగుంటూరు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద మహిళలకు, యువతకు లెమన్ అండ్ స్పూన్ ఆటలు నిర్వహించారు. స్థానిక మహిళలు, పిల్లలు ఉత్సాహంగా ఆటల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, సిఐటియు నాయకులు టి.శ్రీనివాస్, కృష్ణకుమారి, చిన్నమ్మాయి, సామ్రాజ్యం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి నగర్లో ఆటల పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్రోడ్డులోని ప్రగతి నగర్లో సంక్రాంతి సందర్భంగా ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో మహిళలు, యువతలకు మ్యూజికల్ చైర్స్, బుట్టలోబాలు, లెమన్ అండ్ స్పూన్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ మహిళలు నిత్యం కుటుంబ బాధ్యతలతో సతమతమం అవుతూ ఉంటారని, అలాంటి వారికి పండుగల సందర్భంగా నిర్వహించే ఆటల పోటీలు ఆటవిడుపుగా ఉంటాయన్నారు. ఆటలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. పండుగల సందర్భంగా కోడి పందాలు తాగుడు జూదం ఇలాంటి వాటికి యువత దూరంగా ఉండాలని, పిల్లలను సెల్ఫోన్కు దూరంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు గుంటూరు కార్యదర్శి బి. ముత్యాలరావు, స్థానిక స్థానిక ఏరియా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఫాతిమా, నాగలక్ష్మి, సుహాసిని, పవన్, గని, కిన్నెర తదితరులు పాల్గొన్నారు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు